క్లుప్తంగా

18న సర్వసభ్య సమావేశం

పెన్‌పహాడ్ : ఈ నెల 18న పెన్‌పహాడ్ మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో వివరాలతో హాజరు కావాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

చివ్వెంల : సూర్యాపేట పట్టణానికి చెందిన ప్రముఖ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆర్వీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని అక్కల దేవిగూడెం గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమలో బెల్లకొండ ప్రియాంక, డాక్టర్ బి.క్రాంతి, బెల్లకొండ రామ్మూర్తి, పుట్ట వెంకటేశ్వర్లు, లోడే వెంకన్న, పాడిశెట్టి శ్రీకాంత్, నాగరాజు, సిబ్బంది ప్రశాంత్, సురేష్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మద్దిరాల : మండల కేంద్రంలో శుక్రవారం విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ముసిగుంపుల సోమయ్య తన గేదెను రోజు మాదిరిగానే వ్యవసాయ భూమిలో మేపుతున్నాడు. ఈ క్రమంలో అక్కడే తెగిపడి ఉన్న విద్యుత్ లైన్ వైర్లు గేదెకు తగిలాయి. దీంతో విద్యుదాఘాతం ఏర్పడి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.50వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

ప్రమాదకరంగా సీసీరోడ్డు



పాకురు పట్టిన సీసీరోడ్డు

నాగారం : నాగారంబంగ్లా గ్రామంలో పాత తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న వీధిలో సీసీరోడ్డు రోడ్డు పాకురు పట్టి జారుడు బండను తలపిస్తోంది. గ్రామ పంచాయతీకి నీటిని సరఫరా చేసే బోరు పైప్‌లైన్ లీకేజీ కారణంగా నీరు రోజు సీసీరోడ్డు పైనుంచి ప్రవహించడంతో రోడ్డు 10 మీటర్ల మేర పాకురు పట్టింది. దీంతో చిన్నపిల్లలు, బావుల వద్దకు వెళ్లే రైతులు, వాహనదారులు జారిపడి గాయాలపాలవుతున్నారు. గత కొంత కాలంగా లీకేజీ సమస్యతో నీరు వృథా అవుతున్నా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోలేదని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు చొరవ తీసుకుని నీటి లీకేజీని అరికట్టి సీసీరోడ్డును మరమ్మతులు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా.. సమస్య తమ దృష్టికి వచ్చిందని, పైప్‌లైన్ లీకేజీని అరికట్టి, సీసీరోడ్డు మరమ్మతులు చేపడుతామని తెలిపారు.

నాణ్యత పాటించడం లేదని అధికారులకు ఫిర్యాదు

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ ఆవాసం తూర్పుతండా బీటీరోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యత పాటించడం లేదని తండా గిరిజనులుతో పాటు కాసర్లపహాడ్ గ్రామస్తులు సంబంధిత అధికారులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ తండాకు ఎస్టీ ఎస్‌డీఎఫ్ నిధులు రూ.2.10 కోట్లతో 3 కిలోమీటర్ల రోడ్డును బీటీగా చేస్తున్నారని తెలిపారు. అయితే నాణ్యత లోపంతో బీటీ రోడ్డు నిర్మిస్తుండగానే తారు, కంకర లేచిపోతుందని ఆరోపించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని మూడు రోజుల కిందట నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. పనుల్లో నాణ్యత పాటించేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వానాకాలం సాగు షురూ

- గోదావరి జలాలపైనే ఆశలు
- దుక్కులు, నారుమడులు సిద్ధం చేస్తున్న రైతులు
- జాజిరెడ్డిగూడెం మండలంలో 21 వేల ఎకరాల్లో వరి సాగు అంచనా



అర్వపల్లిలో పొలం సాగుకు దున్నిన దుక్కి



అడివెంల సమీపంలో సిద్ధం చేసిన పొలం

అర్వపల్లి : వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో చిరు జల్లులు పడగా అన్నదాతలు దుక్కులు దున్ని నారుమడులు సిద్ధం చేస్తున్నారు. అయితే కొంతకాలంగా ఎక్కువ మంది గోదావరి జలాలపైనే ఆధారపడి పంటలు సాగుచేస్తున్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టులో నీళ్ల లేకపోవడంతో ఈసారి నీళ్లు వస్తాయా.. రావా అనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వర్షాలు పడి ఎస్సారెస్పీ ప్రాజెక్టు, లోయర్‌మానేరు డ్యాంలు నిండితేనే నీళ్లు అందుతాయని అధికారులు చెబుతున్నారు.

ఎస్సారెస్పీ నీటిపైనే ఆధారం..

ఈ వానాకాలం సీజన్‌లో జాజిరెడ్డిగూడెం మండలంలో సాధారణంగా 21 వేల ఎకరాలకు పైగానే వరి పంట సాగవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఇందులో 15 వేల ఎకరాల వరకు గోదావరి జలాలపై ఆధారపడి రైతులు పంటలు సాగుచేస్తున్నారు. మిగిలిన రైతులు బోర్లు, బావులు, వర్షాలపై ఆధారపడి పంటలు వేసుకుంటున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటికే మండలంలో 15వందల ఎకరాలకు పైగానే పత్తి పంట సాగవుతోంది. 70 శాతం మంది రైతులు పత్తి విత్తనాలు వేశారు. వరి సాగుచేసే రైతులు పనులు ప్రారంభించినప్పటికీ గోదావరి జలాల ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

గోదావరి జలాలపైనే ఆధారం



ప్రతిసారి వరి పంటను గోదావరి జలాలతోనే సాగుచేస్తున్నాం. నాకు వేరే నీటి వసతి లేదు. గత యాసంగిలో గోదావరి జలాలు సరిపోను రాక నష్టపోయాను. ఈసారి వెంటనే గోదావరి జలాల విషయాన్ని అధికారులు తేల్చాలి.

- సుంకరి వెంకన్న, రైతు, సీతారాంపురం

సాగు పనులు మొదలు పెట్టారు



మండలంలో వానాకాలం సీజన్ వ్యవసాయ పనులను రైతులు మొదలు పెట్టారు. దుక్కులు, నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ సీజన్‌లో 21వేల ఎకరాలకు పైగానే వరి పంటలు సాగవుతాయని అంచనా. ఇప్పటికే రైతులు మండలంలో 70 శాతం పైగా పత్తి పంటలు సాగుచేసుకున్నారు.

- రావి శశిధర్‌రెడ్డి, ఏఓ

ఎఫ్‌టీఎల్ పరిధిలోని కట్టడం కూల్చివేత

సూర్యాపేట : పట్టణంలోని సద్దల చెరువు (మినీ ట్యాంక్ బ్యాండ్) ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని శుక్రవారం అధికారులు కూల్చివేశారు. కలెక్టర్ ఎస్.వెంకటరావు ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాన్ని తొలగించారు. వారం రోజుల్లో పూర్తి నిర్మాణాన్ని స్వయంగా తొలగిస్తామని సదరు నిర్మాణదారులు రాతపూర్వకంగా ఇచ్చిన వినతితో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవరావుతో పాటు ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖలకు చెందిన పలువురు అధికారులు ఉన్నారు.

రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే..



కూల్చివేసిన రెస్టారెంట్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ



కూల్చివేసిన రెస్టారెంట్

సూర్యాపేట : రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే సూర్యాపేట పట్టణంలో కూల్చివేతలు జరుగుతున్నాయని మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ సమీపంలో ఉన్న జాజు రెస్టారెంట్‌ను మున్సిపల్ అధికారులు కూల్చివేసిన విషయం తెలుసుకున్న ఆమె పలువురు కౌన్సిలర్లతో వెళ్లి ఆ రెస్టారెంట్‌ను సందర్శించి మాట్లాడారు. మున్సిపాలిటీ అధికారులు పాలక మండలికి కనీస సమాచారం లేకుండా, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కట్టడాలను కూల్చివేయడాన్ని తీవ్రంగా తప్పు పడుతున్నామన్నారు. అధికారులు చట్ట ప్రకారం పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జీడి భిక్షం, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, కౌన్సిలర్లు లవకువ, తాహేర్‌పాషా, నాయకులు బూర బాలసైదులుగౌడ్, సాగర్‌రెడ్డి, జానీ, భావసింగ్, సందీప్, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ విద్యను బలోపేతం చేయాలి



తిరుమలగిరిలో ఇంగ్లిష్ డిక్షనరీలను పంపిణీ చేస్తున్న ప్రొఫెసర్ వెంకటరాజయ్య



ఫణిగిరి జెడ్పీహెచ్‌ఎస్‌లో డిక్షనరీలను అందజేస్తున్న ప్రొఫెసర్ వెంకటరాజయ్య

తిరుమలగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ విద్యను బలోపేతం చేయడానికి కృషి చేయాలని సీఫెల్ ప్రొఫెసర్ తాటికొండ వెంకటరాజయ్య కోరారు. శుక్రవారం తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు డిక్షనరీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఇంగ్లిష్ వ్యాకరణం, భాషా పరిజ్ఞానం పెంచడం కోసం ఈ డిక్షనరీ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, ప్రధానోపాధ్యాయుడు దామర శ్రీనివాస్, గోలి సత్య ఫౌండేషన్ అధ్యక్షుడు వీరమల్లు, ఉపాధ్యాయులు వీరన్న, రాజు, జానయ్య, వెంకన్న, పుల్లయ్య, శ్రీనివాస్, ఉపేంద్ర, రాజేశ్వరి, హకీమ్, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

నాగారం : ఉపాధ్యాయులు విద్యార్థులను ఆంగ్ల భాషలో పట్టుసాధించేలా ప్రోత్సహించాలని ప్రొఫెసర్ వెంకటరాజయ్య అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల విద్యను బలోపేతం చేయడానికి బోధి సత్వ ఫౌండేషన్ అధ్యక్షుడు పులిగిళ్ల వీరమల్లుయాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫణిగిరి జెడ్పీహెచ్ఎస్, పసునూర్‌లోని మోడల్‌స్కూల్‌లో ఉపాధ్యాయులకు స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ భాష, వ్యాకరణం పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి.బాలునాయక్, కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రెడ్డి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ కుంట రమేష్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేయొద్దు

అర్వపల్లి : మూసీనది నుంచి ప్రభుత్వ అవసరాల కోసం జరుగుతున్న ఇసుక రవాణాకు సంబంధించి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలుపై కొన్ని రోజులుగా కొంతమంది అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వీటిని వెంటనే మానుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శాలిగౌరారం మండలం వంగమర్తి నుంచి ప్రభుత్వ అనుమతితో ఇసుకను యాదాద్రి పవర్ ప్లాంట్‌కు తీసుకెళ్తున్నారని కలెక్టర్ ప్రకటించారని చెప్పారు. ఎమ్మెల్యేకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, మండల యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, మేకల రాంబాబు, కదం శ్రీనివాస్, కె. శ్రీనివాస్, లింగరాజు, నల్లగుంట్ల శ్రీనివాస్, లింగయ్య, నాగార్జున, ఎం. శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాల కోసం పత్తి రైతుల ఎదురుచూపు

- మొదట్లో మురిపించి పత్తాలేని వర్షాలు
- నీటి తడిలేక చేలలో మొలకెత్తని విత్తనాలు
- ఆందోళన చెందుతున్న రైతులు



పత్తి చేలో దంతె తోలుతున్న రైతు

ఆత్మకూర్(ఎస్) : మృగశిర కార్తెకు ముందే వర్షాలు కురవడం, నైరుతి రుతుపవనాలు సకాలంలో వస్తాయని వాతావరణ శాఖ సమాచారం అందించడంతో మండల వ్యాప్తంగా రైతులు పత్తి సాగుకు దుక్కులు సిద్ధం చేశారు. కొన్ని రోజుల క్రితం మండల వ్యాప్తంగా రెండు రోజులపాటు వర్షాలు కురవడంతో రైతులు పత్తి విత్తనాలు నాటారు. కానీ ప్రస్తుతం వర్షాలు కురవడంలేదు. దీంతో పత్తి విత్తనాలు మొలకెత్తడం లేదు. వర్షాలు లేకపోవడంతో భూమిలో తేమ లేకుండాపోతోంది. ఫలితంగా రైతులు మళ్లీ దుక్కులు దున్ని విత్తనాలు నాటాల్సిన పరిస్థితి నెలకొంది.

4 వేల ఎకరాలకు పైగా పత్తి సాగు..

నాన్ ఆయకట్టు ప్రాంతమైన ఆత్మకూరు మండలంలో వరి సాగు తరువాత ప్రధానమైన పంటగా పత్తిని సాగు చేస్తారు. మండల వ్యాప్తంగా ఇప్పటికే దాదాపు నాలుగు నుంచి ఐదు వేల ఎకరాల మధ్యన పత్తి సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా సాగు చేసిన పత్తి ఎక్కడా 60 శాతం కూడా మొలకెత్తలేదు. దీంతో రైతులు మళ్లీ అధిక ఖర్చులు భరిస్తూ పత్తి విత్తనాలను నాటుతున్నారు. విత్తనాల ఖర్చుతోపాటు కూలీల ఖర్చు కూడా పెరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండో సారి నాటాల్సి వస్తోంది



నేను 12 ఎకరాల్లో పత్తి సాగు చేశాను. రెండు వర్షాలు పడగానే పత్తి విత్తనాలు నాటాం. మళ్లీ వర్షాలు రాకపోవడంతో విత్తనాలు సగం కూడా మొలవలేదు. దీంతో రెండవ సారి విత్తనాలు పెట్టాల్సి వస్తోంది.

- సోమిరెడ్డి లింగారెడ్డి, రైతు, ఆత్మకూరు

తొందర పడి విత్తనాలు నాటొద్దు



తొందరపడి పత్తి విత్తనాలు నాటవద్దు. తొలకరి వర్షాలకు భూమిలోపలి వేడి తగ్గదు. వర్షాలు విస్తారంగా కురిస్తేనే విత్తనాలు నాటాలి. అప్పుడే మొలకశాతం పెరుగుతుంది.

- దివ్య, మండల వ్యవసాయ అధికారి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెన్‌పహాడ్ : గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వాటి నుంచి రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి స్రవంతి అన్నారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వీధులతో పాటు ఖాళీ ప్రదేశాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చేపట్టాల్సిన చర్యల పట్ల ప్రజల్లో చైతన్యం కల్పించాలని వైద్య సిబ్బందిని కోరారు. మండల కేంద్రంలో మిషన్ భగీరథ నీరు ఇంటింటికీ వస్తున్నాయని సర్వే చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ కృష్ణసందీప్, ఎంపీఓ నరేష్, పంచాయతీ కార్యదర్శి శివ, అంగన్‌వాడీ టీచర్ విజయ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

నూతనకల్లు : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం మండల కేంద్రంలో పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమానికి మంత్రితోపాటు ఎమ్మెల్యే మందుల సామేల్, భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్ని వసతులు



అర్వపల్లి : పర్సాయపల్లి ప్రాథమిక పాఠశాలలో వంట గదిని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ అండాలు



అర్వపల్లి : సీతారాంపురంలో పిల్లలకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ సునీత



తిరుమలగిరి : వెలిశాలలో బడి బాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలకు అన్ని వసతులు కల్పిస్తున్నట్లు పర్సాయపల్లి పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ కుంభం అండాలు చెప్పారు. మండల పరిధిలోని పర్సాయపల్లి ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన వంట గదిని శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. పిల్లలకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, రాగిజావ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొరపిడత అవిలయ్య, ప్రధానోపాధ్యాయుడు కుర్రె శ్రీను, సురేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తకాలు, యూనిఫాం పంపిణీ

ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని అమ్మ ఆదర్శ కమిటీ పాఠశాల చైర్‌పర్సన్ మేకల సునీతరాంబాబు చెప్పారు. మండల పరిధిలోని సీతారాంపురం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పిల్లలకు పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మోర ఆనంద, ఉపాధ్యాయినిలు భవాని, బందెల భాగ్యమ్మ పాల్గొన్నారు.

తిరుమలగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, బడి ఈడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని వెలిశాల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.సోమయ్య, ఉపాధ్యాయులు శ్రవణ్‌కుమార్, మల్లయ్య, రామాంజనేయులు, ఖాదర్ పాషా, దస్తగిరి, సంతోష్‌కుమార్, ఉపేందర్, నగేష్, ఎల్లమ్మ, అనితాకుమారి, పాఠశాల చైర్మన్ ఆకుల సరిత తదితరులు పాల్గొన్నారు.

జూలై 4న దొడ్డి కొమురయ్య వర్ధంతి సభ



తుంగతుర్తిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

తుంగతుర్తి : తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో జూలై 4న జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు పేర్ల నాగయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని దుబ్బాక సంజీవరెడ్డి విజ్ఞాన భవనంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి సభ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సభకు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కట్ట రమ, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, ఇల్లందు మాజీ శాసనసభ్యుడు గుమ్మడి నర్సయ్య హాజరవుతారని తెలిపారు. ఈ సభను విజయవంతం చేయడానికి ప్రజలు, ప్రజాస్వామికవాదులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా నాయకులు వేర్పుల పరశురాం, మామిడి సుధాకర్, నారాయణ, హుస్సేన్, యాకూబ్, లక్ష్మి, నర్సయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం



తుంగతుర్తి : వెంపటి పాఠశాలలో విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు



నాగారం : ఫణిగిరి పాఠశాలలో..

తుంగతుర్తి : మండల పరిధిలోని వెంపటి ప్రాథమిక పాఠశాలలో జయశంకర్‌సార్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాలలో 1వ తరగతిలో చేరిన విద్యార్థులతో అక్షరాలను రాయించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు చిత్తలూరి వెంకట్రామనర్సమ్మ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కోరుకొప్పుల ఉమారాణి, ఉపాధ్యాయులు భీవనపల్లి శ్రీనివాస్, పాలకుర్తి ఎల్లయ్య, పాలకూర్తి జ్యోతి, మల్లెపాక రవీందర్, రమాదేవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి ప్రాథమిక పాఠశాల, ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాలల్లో బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలల్లో నూతనంగా చేరిన 1వ తరగతి విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రేణుక, నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, శ్రీజ, ఉమమహేశ్వరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర చేస్తున్న వారికి సన్మానం



డి.కొత్తపల్లిలో సన్మానిస్తున్న నాయకులు



అర్వపల్లిలో స్వాగతం పలుకుతున్న నాయకులు

నాగారం : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సూర్యాపేట శాసన సభ్యులుగా హ్యాట్రిక్ విజయం సాధించిన సందర్భంగా జగదీష్ అన్న సైన్యం ఆధ్వర్యంలో ఆయన అభిమానులు సూర్యాపేట నుంచి యాద్రాద్రి పుణ్యక్షేత్రం వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర శుక్రవారం డి.కొత్తపల్లి మీదుగా వెళ్తుండగా స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు వారికి స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పడిశాల వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

అర్వపల్లి : సూర్యాపేట ఎమ్మెల్యేగా వరుసగా మూడోసారి జగదీష్‌రెడ్డి గెలిచిన సందర్భంగా అతడి అభిమానులు మొక్కులు చెల్లించుకునేందుకు సూర్యాపేట నుంచి యాదాద్రికి చేపట్టిన పాదయాత్ర శుక్ర వారం అర్వపల్లికి చేరింది. స్థానిక శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కడారి నరేష్‌యాదవ్, మామిడాల రాజలింగం, బైరబోయిన పెద్దయ్య, వట్టె వెంకన్న, పులిచర్ల ప్రభు, ఎల్లంల శ్రీకాంత్, మనుబోతుల నరేష్, బింగి సాయి పాల్గొన్నారు.

భగీరథ నీటి సరఫరాపై సర్వే

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాపై సర్వే కొనసాగుతోంది. శుక్రవారం గ్రామాల్లో పలువురు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికీ తిరుగుతూ మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా, లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్‌డి.ఇమామ్, డాక్టర్ బి.అఖిల, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. పలు ప్రాంతాలు జలమయం

అర్వపల్లి : అర్వపల్లితో పాటు మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఈ వర్షంతో స్థానిక ప్రభుత్వ కార్యాలయాలు, శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, పాఠశాలలు జలమయంగా మారాయి. ఈ వర్షంతో పత్తి పంటలకు ప్రాణం పోసినట్లయింది.

మద్దిరాలలో మోస్తరు వర్షం

మద్దిరాల : మండల పరిధిలోని ఆయా గ్రామాలలో శుక్రవారం మోస్తరు వర్షం కురుసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



మద్దిరాలలో కూలిన చెట్టు



జలమయమైన అర్వపల్లిలోని ఎమ్మార్సీ భవనం



నీటితో నిండిన అర్వపల్లి పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రం ఆవరణ

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన వాహనం



విరిగి ఇంటిపైకి ఒరిగిన విద్యుత్ స్తంభం

ఆత్మకూర్(ఎస్) : గుర్తుతెలియని వాహనం ఢీకొని విద్యుత్ స్తంభం విరిగి ఇంటిపైకి ఒరిగింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. పాతర్లపహాడ్‌లో విద్యుత్ స్తంభాన్ని గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో స్తంభం విరిగి ఎదురుగా గుంటూరు శాంతయ్య ఇంటిపైకి ఒరిగింది. వెంటనే స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఉదయం నూతన స్తంభాన్ని ఏర్పాటు చేశారు.